# పురాణ-రాజకీయం

చావా శివకోటి

యయాతి జ్వరంతో రాజధానికొచ్చాడు.

ఆ రోజే- తన సంతానాన్ని దగ్గరకు పిలుచుకున్నాడు.

అందరూ వచ్చారు. వారిని చూసి సంతోషించి "నాయనలారా! మీలో ఎవరైనా- నా ముసలితనాన్ని స్వీకరించి మీ యవ్వనాన్ని నాకివ్వండి అనడిగాడు.

యదువు, తుర్వసుడు, ద్రుహ్యుడు, అనువు అను కుమారులూ యయాతి మాటని త్రోసి రాజని - వెళ్ళిపోయారు. కడపటి వాడైన పూరువు సంతోషంగా తండ్రి కోరిక తీరుస్తానన్నాడు.

అప్పుడు యయాతి ఆనందపడి "నాయనా! ఈ రాజ్యం నాది. నా తదనంతరం నువ్వే రాజువు అన్నాడు.

యయాతి యవ్వనవంతుడై అన్ని భోగాలనూ అనుభవించాడు. యజ్ఞయాగాలు చేశాడు. దానధర్మాలతో దేవతలను తృప్తిపరిచాడు.

చాలా సంవత్సరాల కాలం గడచింది. ఒకరోజు పూరువుని పిలిచాడు యయాతి.

"నాయనా! కుమారా! నేను పొందని సుఖం లేదు. అయినా తృప్తిగాలేదు. ఇంకా కోరికల పై ఆశ చావడంలేదు. ఈ ఆశ అనేది మనిషి మరణంతోనే చస్తుంది. కనుక నేను నా వార్ధక్యాన్ని తీసుకుంటాను. తపస్సు చేసుకోవాలని ఉంది అన్నాడు.

తండ్రి మాటను విని "సరే" నన్నాడు.

రాజు ప్రముఖులనూ, మంత్రులనూ, సేనాపతులనూ పిలిచి ఆచార్య శుక్రులవారు సెలవిచ్చినట్లుగా - నా వార్ధక్యాన్ని తీసుకున్నవాడే రాజవుతాడు. అంచేత పూరువును రాజు చేస్తున్నాను. వీనికంటే జ్యేష్ఠులు నలుగురున్నా వారు శాపగ్రస్తులు- కనుక రాజ్యార్హులుకారు. అని వెళ్ళిపోయాడు.

యయాతి మాట ప్రకారం ప్రజలు పూరువునే రాజుగా చేసుకొన్నారు.

యయాతి మాత్రం అడవులకు వెళ్ళిపోయాడు.

❋ ❋ ❋

పాలకపార్టీ మహాసభ కృష్ణా తీరాన జరుగుతుంది.

అయిదు రోజుల సభ అది. అయిదేళ్ళ పాలనలో ఏం చేసామన్నది చెప్పేందుకు ఏర్పాటయిన సభ అది.

దేవేంద్రుని నగరంలాగా అలంకరించారు. విద్యుద్దీపాలతోనే ఆర్భీరు తీసారు.

మంత్రివర్గానికున్న అన్ని శాఖలూ-తామేం చేసాం చెప్పడానికి తమ తమ ఏర్పాట్లను త్వరితంగా అందంగా జనానికి ఆహ్లాదం కలిగించే రీతిలో పూర్తి చేసారు.

స్టాల్స్ తెరిచారు.

ఎడ్ల పందాలుకూడా పెట్టారు.

కోళ్ళ పందాలుకూడా బ్రహ్మాండగా నడచినాయి.

ఆడవాళ్ళకు ముగ్గులెయ్యడం కళాపీ చల్లడంలో పోటీలు పెట్టారు.

అంత ఎండలో పరుగు పందాలు నిర్వహించారు.

ఒకటిచేసి - ఒకటిచేయలేదని లేరు.

జనం ఎలా ఆకర్షితులవుతారో- అలా.

ఏంచేస్తే-వస్తారో-అలా.

వచ్చాక చెప్పింది చచ్చినట్లు ఎలావింటారో అలా-

ఏర్పాట్లూ, మంత్రులూ, వందిమాగదులూ పూర్తి చేస్తారు.

నాలుగవనాటి సభలో - పార్టీ అధ్యక్షుణ్ణి ఎన్నుకోవాలి.

సభ అయితే సజావుగానే జరిగింది కానీ- ఎన్నిక జరగలేదు.

కారణం-మామూలువాళ్ళకు అర్థంకాలేదు. మంత్రులకన్నా అర్థమయిందా?

అంటే. విచారించినమీదట వారికి అర్థమైనట్లుగా కనిపించలేదు.

అసలేమీ అర్థంగాకపోయినా, కార్యకర్తలకు ఫలానా ఏమిటి? అని అడిగే ధైర్యం ఈ దేశంలో లోపించి చాలా కాలమయిందను కోండి.

ఇక్కడ అతి ముఖ్యమైన మంత్రులకూ రాజనిర్వాహకులకుకూడా ఇదిపోయినట్లుగా అనిపించింది. కాని ఎవ్వరూ ఆశ్చర్యంలాంటిది ప్రకటించలేదు.

చాతకానమ్మకు చానామంది మొగుళ్ళన్నట్లు

కొత్త అధ్యక్షుడెవరా! అన్నదానిమీద- పత్రికలవాళ్ళు. మంత్రులు- "పార్టీని నడుపుతున్నాం" అనుకోగలిగిన వాళ్ళు- నానారకాల ఊహాగానాలు చేసారు.

వాళ్ళు అనుకున్నదల్లా - పేపరువాళ్ళు రాసేసారు.

ప్రొద్దున ముఖ్యమంత్రిగారు పేపరుతిరగ వేస్తూంటే ఊహాగానాలు కనిపించినాయి.

చిరుకోపం వచ్చింది.

వీళ్ళకిలా మాటాడే హక్కు- ఎవరిచ్చారు? ఎందుకిలా మాటాడారు? అని-

అందుకే చివరినాడు-

సభాముఖంగా ఒక ప్రకటన చేసారు.

"పార్టీ అధినేతను ఎన్నుకోవడం అంటే మాటలు కాదు.... ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న పార్టీకి అధినేతను మనం ఎన్నుకునేది వంకాయల వ్యాపారినికాదు.... అతను సమర్థుడూ, ప్రజారంజకుడూ అయి ఉండాలి.... అలాంటి వ్యక్తికోసం అన్వేషిస్తున్నాం. మనది పేద-బడుగువర్గాల ప్రజలపార్టీ - ఆస్తులూ, అంతస్తులూ ఉన్నవారు మనకు స్నేహితులూకారు-హితులుకారు - ఈ భావనలు కలిగిన వ్యక్తి కోసం నా అన్వేషణ.

లోగానే ప్రారంభమైంది. అందరికీ సుఖం కూర్చగల వ్యక్తిని మనం ఎన్నుకోవాలి.

అతను ప్రజా శ్రేయస్సు తన భుజస్కంధాలపైన మోయగలగాలి.

నాకు తెలుసు. మరో గురుతరమైన బాధ్యత నాపైఉంచుతారని అనగానే చప్పట్లుమ్రోగాయి సావకాశంగా ఆ పని చేసుకుందాం. మొదట మనం సాధించిన ప్రగతిని చూడండి.

ఇది అవితర సాధ్యమైంది. మీ అండదండలతో ఈ అభివృద్ధిని సాధించగలిగాం. అని గర్వంగా చెపుతున్నాను. ఈ అభివృద్ధి మీది. మీకు. జై హింద్ అన్నాడు.

జనం బావుందనుకున్నారు.

పార్టీ పెద్దలూ, మంత్రులూ "మనం ఏం చేయగలం అనుకున్నారు.

పార్టీ కార్యకర్తలుమాత్రం ముఖ్యమంత్రిగారికి తెలుసు. ప్రజలు ఎవర్ని కొనుక్కుంటున్నారో? అయినా మనందరి మేలుకోసం ఇంకా ఆలోచిస్తున్నారు అని.

❋ ❋ ❋

చేసినదేదైనాకనిపిస్తుంది గదా! మరి ఇన్ని లక్షల ప్రజాధనంవినియోగించి వర్మావాషింగ్ పౌడరులా - తలనొప్పి వచ్చేలా రంగులలో చూపించితేగాని అర్థంగాదు? అన్నాడో రాజకీయ నాయకుడు బాధపడుతూ.

మనకు అర్థం కావాలనే మాటెందుకు? మనమేం చేస్తామో తెల్సుకదా?

మనమెన్నుకున్న జనానికి తెలియాలి. మనం ఎంత కష్టపడి (ఎయిర్ కండిషన్ గదులలో) ఈ ప్రగతి సాధిస్తున్నామో! మనం చేసేది జనందాకా వెళ్ళడం లేదుగనుక- ఇలావెళ్ళి-అట్టి అనిపించుకోవాలి. ఇది ప్రగతి కాదు. మెదడున్నవాడి రాజకీయం. ❋